హంసకాకీయోపాఖ్యానం

(సరళ వ్యాఖ్యాన సహితం)

వ్యాఖ్యాత
డా॥ ఎస్.వి. రామారావు

ప్రచురణ
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.
2018

HAMSA KAKIYOPAKHYANAM
with Commentary

Commentary by
Dr. S.V. Rama Rao

T.T.D. Religious Publications Series No. 1298

First Print : 2018

Copies : 2000

Published by :
Sri Anil Kumar Singhal, I.A.S.
Executive Officer
Tirumala Tirupati Devasthanams
Tirupati

D.T.P.
Publications Division
T.T.D., Tirupati.

Printed at
Tirumala Tirupati Devasthanams Press
Tirupati - 517 507

ముందుమాట

భారతీయ సనాతన సంస్కృతీ, సంప్రదాయాలకు వేదాలు, పురాణాలు, ఇతిహాసాలు మూలాధారాలుగా ఖ్యాతిగాంచాయి. వేదాలలోని సారాన్ని రంగరించి భగవాన్ వేదవ్యాసుల వారు మహాభారత ఇతిహాసాన్ని పంచమవేదంగా తీర్చిదిద్దారు. మహాభారతం మన జాతీయ కావ్యం. చతుర్విధ పురుషార్థాల సాధనకు కావలసిన విజ్ఞానమంతా ఇందులో చక్కగా వేదవ్యాసుల వారు ఇమిడ్చారు. మహాభారతం పంచమవేదంగానే కాక భారతీయ విజ్ఞాన శాస్త్ర సర్వస్వంగా ప్రశస్తికెక్కింది.

వేదవ్యాసుల వారు భారత కథను జయేతిహాసంగా తీర్చిదిద్ది తన శిష్యులద్వారా వివిధ లోకాలలో వ్యాపింపజేశారు. వైశంపాయనుడు జనమేజయ మహారాజుకు ఈ కథను వినిపించాడు. అలా వినిపించగా పెంపొందిన కథను భారతం అన్నారు. ఆ తరువాత రోమహర్షణుని కుమారుడైన ఉగ్రశ్రవసుడు నైమిశారణ్యంలో సత్రయాగం చేస్తున్న శౌనకాది మహామునులకు వివరించాడు. మునులడిగిన ప్రశ్నలకు ఉగ్రశ్రవసుడు చెప్పిన కథార్థాలతో కలిపి భారతం **"మహాభారతం"** అయ్యింది.

"యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి న తత్ క్వచిత్"

ఇందులోఉన్నది ఎక్కడైనా ఉంటుంది. ఇందులో లేనిది ఎక్కడా ఉండదు - అని సూత పౌరాణికులు శౌనకాది మహామునులకు మహాభారత ప్రాశస్త్యాన్ని వివరించాడు.

పంచమవేదంగా, భారతీయ విజ్ఞాన శాస్త్రంగా ఖ్యాతిగొన్న సంస్కృత వ్యాసభారతాన్ని ఆదికవి నన్నయ, కవిబ్రహ్మ తిక్కన, ప్రబంధ పరమేశ్వరుడు ఎఱ్ఱన ఆంధ్రీకరించారు.

తిరుమల తిరుపతి దేవస్థానములు ధర్మప్రచారంలో భాగంగా కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతానికి తెలుగులో సుప్రసిద్ధ పండితులచే చక్కటి వ్యాఖ్యానాన్ని వ్రాయించి 15 సంపుటాలుగా ముద్రించి తెలుగు ప్రజలకు అందించింది. తి.తి.దే. ముద్రించిన కవిత్రయ విరచిత శ్రీమహాభారతం విశేష ప్రజాదరణను పొంది ఇప్పటికే దాదాపు 25,000లకు పైగా ప్రతులు అమ్ముడుపోయాయి.

ఇదివరకు తి.తి.దే. ముద్రించిన కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతంలోని ప్రశస్తమైన నలోపాఖ్యానం, సావిత్రి ఉపాఖ్యానం వంటి ఉపాఖ్యానాలను, సుప్రసిద్ధ ఘట్టాలను, కథలను వ్యాఖ్యానంతోపాటు ప్రత్యేకించి చిన్న చిన్న పుస్తకాలుగా ముద్రిస్తే నేటి తరం సమాజానికి చాలా ఉపయోగకారి అవుతుందని తి.తి.దేవస్థానములు సంకల్పించింది. ఆ సంకల్పానికి ప్రతిరూపమే ఈ భారతోపాఖ్యానాలు గ్రంథమాల. ఈ గ్రంథమాలలో భాగంగా ఉదంకోపాఖ్యానం, గరుడోపాఖ్యానం, యయాతి చరిత్ర, దుష్యంతోపాఖ్యానం, శిశుపాలుని కథ, నలోపాఖ్యానం, ధర్మవ్యాధోపాఖ్యానం, రామోపాఖ్యానం, సావిత్ర్యుపాఖ్యానం, కీచకుని కథ, శ్రీకృష్ణరాయబారం, అంబోపాఖ్యానం, హంసకాకీయోపాఖ్యానం, నాడీజంఘుని కథ, బ్రాహ్మణగీతలు అనే 15 శీర్షికలను ఎంపిక చేసి తెలుగు రాష్ట్రాలలో సుప్రసిద్ధులైన పండితులచే చక్కటి పీఠికలను వ్రాయించి, ముద్రించి ప్రజలకు అందుబాటులోనికి తీసుకువస్తున్నది. ఇందులో భాగమే ప్రస్తుతం మీకందిస్తున్న **హంసకాకీయోపాఖ్యానం.**

భక్తమహాశయులు, సాహితీ ప్రియులు ఈ గ్రంథమును ఆదరిస్తారని మనసార కోరుకుంటూ...

సదా శ్రీవారిసేవలో...

కార్యనిర్వహణాధికారి
తి.తి.దేవస్థానములు, తిరుపతి

పీఠిక

మహాభారతం మన జాతీయ కావ్యం (National Epic). ఇందులో గల పదునెనిమిది పర్వాల్లో ఎనిమిదవది కర్ణపర్వం. ఈ పర్వంలో కర్ణుడు కౌరవ సేనానాయకుడుగా కొనసాగిన రెండు దినాల (16వ, 17వ రోజులు) భారతయుద్ధగాథ వర్ణించబడింది.

రెండవ దినాన (17వ రోజున) కర్ణుడు శల్యుణ్ణి తన రథానికి సారథిగా చేసికొని, పాండవ సైన్యమందలి వీరులతో – ముఖ్యంగా అర్జునునితో – విజృంభించి యుద్ధం చెయ్యటం జరిగింది. సారథియైన శల్యుడు ఆ రోజున ఆదినుండీ కర్ణుణ్ణి తన మాటలచేత అనేక విధాల నిరుత్సాహపరుస్తూ సారథ్యం సాగించినాడు. మహావీరుడైన కర్ణుని దృఢనిశ్చయంతో కూడిన సమరోత్సాహాన్ని తగ్గించటానికి శల్యుడు వల్కిన పల్కులలో అత్యంత ప్రధానంగా చోటుచేసికొన్నది "హంసకాకీయోపాఖ్యానము" – అనే కథ (Parable).

ఉపాఖ్యానమంటే ఇతరత్ర తాను వినిన కథను చెప్పుట. 'శ్రుతస్య అర్థస్య కథనం ఉపాఖ్యానం ప్రచక్షతే' – అని లాక్షణికుల నిర్వచనం. ఉపాఖ్యానం ప్రధానకథకు అధీనమై నడుస్తూ, వస్త్వైక్యం దెబ్బతినకుండా, సందర్భోచితంగా, సంక్షిప్తంగా, స్పష్టంగా ఉంటుంది. 28 గద్య పద్యాల్లో నెలకొనియున్న ఈ ఉపాఖ్యానం పై ఉపాఖ్యాన లక్షణాలన్నింటినీ పుణికి పుచ్చుకొన్నదై, చక్కగా విలసిల్లుతూ వున్నది.

హంస, కాకీయ–ఉపాఖ్యానంలో కాకి, హంస–ఈ రెండు పక్షులు ప్రధాన పాత్రలు. వైశ్యశ్రేష్ఠుని యింటిలో ఎంగిలిమెతుకులు తిని, క్రొవ్వి, గర్వించిన కాకి స్వశక్తి తెలియక, అతని కుమారుల మాటలకు ఉబ్బిపోయి, హంసతో ఆకాశయానంలో పోటీపడింది! ఓటమిపాలై, తుదకు ఆ హంసచేతనే రక్షింపబడింది!! ఇది యీ ఉపాఖ్యానంలోని సారాంశం.

పరిమితిలో చిన్నదై ఉన్నా, ఈ ఉపాఖ్యానాన్ని రచించటంలో మహాకవి తిక్కనామాత్యుడు నాటకీయతా లక్షణాన్ని అపూర్వంగా నెలకొల్పి, దీనిని చక్కని కవితాఖండంగా తీర్చియున్నాడు. "అంబుధిలో నొక్క యలఘుతరద్వీపమున ధర్మవర్తినాఁ జను నరేంద్రుపురమున" – ఇత్యాది సీసపద్యం ద్వారా – సముద్రము, దాని నడుమ ఒక పెద్ద ద్వీపం, ఆ దీవి నడుమ ధర్మవర్తి అనే రాజు ఏలే పట్టణం, ఆ నగరంలో సంపన్నుడు, బహుపుత్రవంతునైన వర్తక ప్రముఖుని నివాసం, ఆతని కుమారుల పెంపకంచేత క్రొవ్వియున్న కాకి – వీటన్నింటితో గూడిన విపులమైన దృశ్యాన్ని విహగావలోకన (bird's eye view) పద్ధతిలో చిత్రించిన రీతి మిగుల మనోజ్ఞంగా విలసిల్లుతూవుంది. 'అలాక్షరముల అనల్పార్థరచన' – అంటే ఇలాంటిదే!

ఈ కథలోని ముఖ్యపాత్రలు: i) కాకి, ii) మేటిహంస. ఈ రెండిటి సంవాదాన్ని, వాటియొక్క స్వభావాలను ప్రకటించే శైలిలో, తేటతెలుగు పలుకుబడిగల కందం, ఆటవెలది పద్యాల్లో రచించి, మహాకవి ఇందులో వృత్త – ఔచిత్యాన్ని సముచితంగా పాటించియున్నాడు.

ఈ ఉపాఖ్యాన విశిష్టతకు అక్షర నిదర్శనంగా అలరారుతున్న ఈ క్రింది సన్నివేశం ఈ సందర్భంలో ప్రచురంగా పరికింపదగివుంది –

కాకి పశ్చాత్తాపంతో హంసను ప్రార్థించటం :

క. 'నాకొలఁది యిప్పు డెఱిఁగితి,
నీ కరుణాలోకనంబు నిగిడించి, శర
ణ్యా! కావు నన్ను; మగుడం
గాకులలోఁ గలుపఁ దగవుగాదే నీకున్?

హంస కాకిని కాపాడటం :

క. 'వెరవునఁ దత్తనువుం దన
చరణంబుల నిఱికి యెత్తి, చావుడిపి, బల
స్ఫురణంబు మెఱయ వీఁపున
ధరియించుచు వచ్చెఁ బక్షితతులు నుతింవన్.

వ. ఇవ్విధంబునం దెచ్చి యెప్పటి నెలవున దించి, యక్కాకి దెప్పిఱిన, రాయంచ దానితో నచ్చటి కాకులు విన 'నింక యవినయంబు లెన్నఁడును జేయకు' మని పలికి, నిజసహచరంబులగు మరాళంబులుం, దానును వలయు చోటికిం జనియె.'

– 2వ ఆశ్వా., 77, 81 పద్య, గద్యములు.

ఈ దృష్టాంత కథను వివరించటంలో, కర్ణుడు ఆ కథలోని కాకివంటి వాడని, అర్జునుడు హంసవంటి వాడని శల్యుడు తన అభిప్రాయంగా ప్రతిపాదించాడు. కవిబ్రహ్మ తిక్కన సోమయాజి ఈ ఉపాఖ్యానం చివర శల్యుని ద్వారా పల్కించిన ఈ క్రింది వాక్యాలు ఆ 'కర్ణసారథి' యొక్క ఉద్దేశ్యాన్ని స్పష్టంగా ఉద్ఘోషిస్తూ వున్నాయి.

వ.'నీవు నా కోమటికొడుకుల యెంగిలికూటం బెరిగిన యక్కాకంబు చందంబున కురుకుమారుల యెంగిళులు గుడిచి క్రొవ్వి, యెక్కుడు వారల ధిక్కరించెదవు. నీ కొలది యెఱుంగవు. దీనం జేటు వాటిల్లుగాన తేటపడ నెఱింగించెద నాకర్ణింపుము.' – 2వ ఆశ్వా., 81వ వచనము.

శల్యుడు పై విధంగా పల్కిన పల్కులకు మహారథియైన కర్ణుడు ఏ మాత్రం నిరుత్సాహపడ లేదు. పైగా, ఆ 'కపటసారథి' ని ఈ క్రింది పద్య, గద్యాలలో గట్టిగా మందలించి, తన ధీరతాగుణాన్ని స్పష్టంగా చాటినాడు.

క. 'దృష్టాంతము సెప్పెదనని
కష్టాత్మా! నీవు నన్ను కాకము, నరు ను
త్కృష్టమరాళముగాగ ని
కృష్టంపుకథ చెప్పి; తిది సఖిత్వము తెఱఁగే?

ఆ. నీచులకు బలంబు నెట్టన పరుసని కాఱు లఱచుచున్కిగాన యిట్లు
పలికి తింతజేసి, భయమయ్యేనే నాకు? నట్టిమాట లింక నాడ కుడుగు!

వ. నీవు వెఱపింపనయ్యెడు కొలందివారిని వెఱపింపుము; కర్ణుండు విక్రమంబునకుం, గీర్తికి నాస్పదంబగుటకు జనియించినవాడుగాని, భయంబు గొనుటకుంగాడు.' – 2వ ఆశ్వా., 97,98,109 పద్య, గద్యములు.

కర్ణుడు పై పలుకులతో విరమింపక, శల్యుడు పాలించే బాహ్లిక, మద్రరాష్ట్రాల్లోని కొన్ని జాతులవారి దురాచారాలను, అవినీతిమయములైన జీవన పద్ధతులను తీవ్రంగా దుయ్యబట్టి, పరిహసించాడు.

ఇక, మద్రరాజైన శల్యుడు సార్థకనామధేయుడు. బలవంతులైన శత్రువుల హృదయాలకు శల్యం (పదునైన బాణం) లాంటివాడనే అభిప్రాయంతో ఆతని తల్లిదండ్రులు అలా నామకరణం కావించారు. అంతేగాక, ఆయన 'అశ్వహృదయం' – అనే అపూర్వవిద్యలో ప్రవీణుడైన గొప్ప రథసారథిగా కూడా ఆ యుగంలో ప్రసిద్ధి వహించాడు. అయితే, ఈ కర్ణపర్వంలో రథస్థుడయిన కర్ణునియొక్క కర్ణాలకు (చెవులకు) ములుకులవంటి పలుకులను ప్రవచించటం ద్వారా తన నామధేయాన్ని ఇంకొక విధంగా సార్థక పరచినాడు!

నిజానికి అంతకు మునుపు శల్యునకు కర్ణునియెడల సూతకులజుడనే న్యూనభావం తప్ప, ద్వేషభావం కాని, శత్రుత్వం కాని లేవు. పరిశీలిస్తే, ఈ పర్వకథలో శల్యునకు మహారథియగు కర్ణునియెడల ద్వేషభావన

ఏర్పడటానికి మూలకారణం ధర్మరాజు కోరిన కోరిక. ధర్మరాజు తన వద్దకు వచ్చిన శల్యుణ్ణి ఈ రీతిగా అభివర్ణించాడు –

'వ. మీకుం గర్ణ సారథ్యంబు కర్తవ్యంబు గాఁగలయది. సమర సమయంబున నిరాకరించి పలికి కర్ణ చిత్తంబునకుం గలంక పుట్టించి, పార్థుని రక్షింపవలయును. అకృత్యంబని యనుమానింపక, మత్ప్రార్థ నంబున నెల్ల భంగుల నివ్విధం బనుష్ఠించుము.' – ఉద్యోగపర్వము 1వ ఆశ్వా., 215 వచనము.

బంధుత్వాభిమానంతో కూడిన పక్షపాతం ప్రేరేపించగా, శల్యుడు, ధర్మరాజు కోరికను నిర్వహించడంలో సంపూర్ణంగా సఫలీకృతుడైనాడు. ఇందువలన సుయోధనుని యెత్తుగడ పూర్తిగా విఫలమైపోయింది!

వేదవ్యాసుడు రచించిన సంస్కృత మహాభారతాన్ని 'కవిత్రయం' అనువదించిన తరువాత, ఆంధ్రమహాభారత కథ ఆధారంగా అర్థవంతములైన అనేక సూక్తులు తెనుగునాట అవిరళప్రచారాన్ని పొందాయి. అలాంటివాటిలో "శల్యసారథ్యం" – అనేది ప్రస్తుతం పేర్కొనదగ్గది. ఈ జాతీయం ఏర్పడటానికి కర్ణపర్వంలోని ఈ 'హంస కాకీయోపాఖ్యానం' ప్రముఖమైన కారణమయిందని చెప్పవచ్చు. కాలక్రమేణ 'శల్యసారథ్యం' – అనే ఈ పదం సమాజంలో శల్యునిలాగా తమ మాటలతో ప్రజలను నిరుత్సాహపరుస్తూ, మభ్యపెడుతూ తప్పుదారి పట్టించే కపటవర్తనులను గూర్చిన హెచ్చరికగా, నీతిగా లోకంలో స్థిరపడిపోయింది!

కర్ణపర్వం ఆధారంగా వెలుడిన లోకోక్తుల్లో ఇంకొకటి కూడా ఉంది–

అది – "కార్తీకంతో వానలు సరి; కర్ణునితో భారతం సరి!" – అనే సూక్తి. అనగా కార్తీక మాసంతో వర్షాలు నిలిచిపోయినట్లే, కర్ణుని వీర మరణంతో భారతకథలోని ముఖ్యమయిన భాగం ముగిసినట్లేనని దీని సారాంశం!

కర్ణపర్వ కథను పురస్కరించుకొని, పై సూక్తులతోపాటుగా, శిష్టజనుల వాడుకలో చక్కని చాటుపద్యం ఒకటి అవతరించింది! శ్రీకృష్ణుడే పలికినట్లుగా జాలువారిన ఆ ఆశుపద్యం ఇది:

క. నరుచేతను, నాచేతను
వరమడిగిన కుంతిచేత, వాసవుచేతన్,
ధరచేత, శల్యుచేతను
అరయంగా కర్ణుడీల్గె నార్గురిచేతన్.

కర్ణుడు పుట్టుకతో కుంతీనందనుడయినా, కౌరవుల పక్షాన పోరాడటం దైవ నిర్ణయంకాగా, నకుల, సహదేవుల మేనమామయైన శల్యుడు కౌరవపక్షంలో చేరటం మానవ (దుర్యోధనుని) ప్రయత్నంగా పరిణమించింది! చివరకు "యతో ధర్మః తతో జయః" – అనే ఆర్యోక్తి అక్షరాలా నిరూపితమయింది!

ఒక్కమాటలో, కర్ణుడు భారత – ఇతిహాసమనే ఆకాశంలో శాశ్వతంగా వెలుగులీనుతూ వున్నటువంటి ఉజ్జ్వలవీర నక్షత్రం!

***'కృతయుగే బలి ర్దాతా'* – కృతయుగంలో బలిచక్రవర్తి దాత;**

***'త్రేతాయాం రఘునందనః'* – త్రేతాయుగంలో శ్రీరామచంద్రుడు దాత;**

***'ద్వాపరే సూర్యపుత్రశ్చ'* – ద్వాపరయుగ మంతటికీ దాతయయిన కర్ణుడు "దానకర్ణుడు"గా ప్రశస్తిగాంచాడు!**

కవిబ్రహ్మ తిక్కనసోమయాజి విరాటపర్వ అవతారికలో **"మహాభారతంబు సమస్త దురితాపహంబును, నభిమత శుభావహంబును, నశుభహరణంబును గావున"** – అని పంచమవేదం యొక్క ప్రాశస్త్యాన్ని ఉదాత్తంగా ప్రబోధించాడు. తదనుగుణంగా కర్ణపర్వమనే ఈ ప్రబంధం యొక్క చివరలో దీని ఫలశ్రుతిని ఈ క్రింది చంపకమాలలోఎంతో ఉత్కృష్టరీతిలో ఉగ్గడించియున్నాడు.

చ. అనలుఁడు, భాస్కరుండును, సుధాంశుఁడు నధ్వర సంప్రవర్తకుల్
వినుము నరేంద్ర! యీక్రతువు విష్ణుమయంబిది నిర్వహించి ర
ర్జునుఁడును, కర్ణుఁడున్ సమరరూపమునన్, తగ నీ ప్రబంధ మిం
పొనరఁ బఠించినన్, వినిన నొందు నరున్ చిరసౌఖ్య సంపదల్.

– 2 ఆశ్వా., 398 ప.

'జనమేజయ మహారాజా! ఈ యుద్ధమనే యజ్ఞం విష్ణుమయం. అగ్ని, సూర్యుడు, చంద్రుడు – ఈ యజ్ఞానికి ఋత్విజులు; దీనిని అర్జునుడు, కర్ణుడు యుద్ధరూపంగా నిర్వహించారు. ఈ ప్రబంధాన్ని ఆసక్తితో చదివినా, వినినా నరుడు శాశ్వత సౌఖ్యాలను, సంపదలను పొందుతాడు.

మొత్తంమీద ఈ ఉపాఖ్యానం 'పంచమవేదం' యొక్క ధార్మిక సందేశాన్ని సంగ్రహంగా చాటుతూ వున్న నీతికథగా, తిక్కనార్యుని కవితా మహిమకు నిదర్శనంగా విరాజిల్లుతూ ఉంది.

– డా॥ కె. జె. కృష్ణమూర్తి

హంసకాకీయోపాఖ్యానమ్

సీ. 'అంబుధిలో నొక్క యలఘుతర ద్వీప ।
మున ధర్మవర్తినాఁ జను నరేంద్రు
పురమున నొక వైశ్యవరుఁ డధ్వరాది స ।
త్కర్మరుఁడును శాంతిదాంతి యుతుఁడుఁ
గరుణాపరుఁడు దాననిరతుండు ధన ధాన్య ।
శోభియు బహుపుత్ర లాభ విలసి
తుండు నై వర్తించుచుండఁగ నిలు సేరె ।
నొక కాకి; యతని పుత్రకులు దాని

తే. కెంగిళులు పెట్టి కొనియాడ నెలమిఁ బెరిఁగి ।
క్రొవ్వి కడుమీఱి యెట్టి పక్షులును దన్నుఁ
బోల వనియెడు దుర్మానమునఁ దృణీక ।
రించి యది పెక్కు భంగులఁ గ్రీడ సలుపు. 1

ప్రతిపదార్థం: అంబుధిలోన్= సముద్రంలోని; ఒక్క, అలఘుతర, ద్వీపమునన్= ఒక విశాల ద్వీపంలో; ధర్మవర్తినాన్+చను= ధర్మమూర్తివలె ఒప్పుతున్న; నర+ఇంద్రు పురమునన్= రాజనగరంలో; ఒక, వైశ్యవరుఁడు= ఒక వైశ్యశ్రేష్ఠుడు; అధ్వర+ ఆది సత్+కర్మరుఁడును= యజ్ఞాలు మున్నగు సత్కర్మలు చేసేవాడును; శాంతి, దాంతి యుతుండున్= శాంతుడు, ఇంద్రియనిగ్రహం కలవాడును; కరుణాపరుఁడు= దయాబుద్ధియు; దాననిరతుండు= దానాలు చేసేవాడును; ధనధాన్యశోభియున్= భాగ్యవంతుండును; బహుపుత్రులాభ విలసితుండును+ఐ= పెక్కుమంది పుత్రులుండటం అనే లాభంచేత ఒప్పుతున్నవాడును అయి; వర్తించుచుండఁగన్= నివసిస్తూ ఉండగా; ఒక కాకి; ఇలు, చేరెన్= (అతడి) ఇంటికి వచ్చింది; అతని, పుత్రకులు= ఆ వైశ్యుడి కుమారులు; దానికిన్= ఆ కాకికి; ఎంగిళులు,

పెట్టి= ఎంగిళ్ళుపెట్టి; కొనియాడన్= పొగడగా; అది= ఆ కాకి; ఎలమిన్+ పెరిఁగి= సంతోషంతో పెరుగుతూ; క్రొవ్వి= గర్వించి; కడున్+మీఱి= మిక్కిలి అతిశయించి; ఎట్టి, పక్షులును= ఎటువంటి పక్షులుకూడా; తన్నున్+పోలవు+ అనియెడు= తనకు సాటిరావనే; దుః+మానమునన్= దురహంకారంతో; తృణీకరించి= లక్ష్యపెట్టక; పెక్కుభంగులన్= పలువిధాలుగా; క్రీడ, సలుపున్= విహరించసాగింది.

తాత్పర్యం: సముద్రంలో-ఒక విశాల ద్వీపంలో ధర్మాత్ముడైన రాజుగారి నగరంలో ఒక వైశ్యుడుండేవాడు. అతడు యజ్ఞాలు చేస్తూ శాంతం, కరుణ, సంయమనం మొదలైన గుణాలతో ఒప్పుతుండేవాడు. పెక్కుమంది పుత్రులతో, భోగభాగ్యాలతో విలసిల్లుతూ దానాలు చేస్తుండేవాడు. ఒక కాకి అతడి ఇంటికి రాగా అతడి కుమారులు దానికి ఎంగిళ్ళు పెట్టి పెంచసాగారు. అది ఆ ఎంగిళ్ళతో పెరుగుతూ గర్వించి ఇతర పక్షులేవీ తనకు సాటిరావన్న దురహంకారంతో ఎన్నో విధాల క్రీడిస్తూ తిరుగుతూ ఉండేది.

వ. ఇట్లు విహరించుచుండ నొక్కనాఁడు గొన్ని హంసంబులు పక్షబలంబున సుపర్ణుతో సరిసేయం దగునట్టివి సముద్రంబు చేరువఁ జనం గని యా కోమటికొడుకు లక్కాకంబునకు వానిం జూపి యి ట్లనిరి. 2

ప్రతిపదార్థం: ఇట్లు, విహరించుచుండన్= ఆ కాకి ఇట్లా విహరిస్తూ ఉండగా; ఒక్కనాఁడు= ఒకరోజు; పక్షబలంబునన్= రెక్కల బలంలో; సుపర్ణుతోన్= గరుడుడితో; సరిచేయన్+తగునట్టివి= సమానమైనట్టివి అయిన; కొన్ని, హంసంబులు= కొన్ని హంసలు; సముద్రంబు చేరువన్= సముద్రం దగ్గరగా; చనన్+కని= రాగా చూచి; ఆ కోమటి కొడుకులు= వైశ్యపుత్రులు; ఆ+ కాకంబునకున్= ఆ కాకికి; వానిన్+చూపి= హంసలను చూపి; ఇట్లు+అనిరి= ఇట్లా అన్నారు:

తాత్పర్యం: ఆ విధంగా కాకి విహరిస్తూ ఉండగా గరుడుడితో సమానమైన రెక్కల శక్తి గలిగిన కొన్ని హంసలు సముద్రాన్ని చేరవచ్చాయి. వైశ్యకుమారులు ఆ హంసలను చూపిస్తూ కాకితో ఇట్లా అన్నారు:

క. 'పులుఁగులలో నీ వెక్కుడు; ।
విలసద్గతి నంచ లిట్లు వినువీథిఁ గరం
బెలమిం జనియెడు వీనిం ।
గలసి పఱచి గెలువవలదె గతుల బహులతన్?' 3

ప్రతిపదార్థం: నీవు; పులుగులలోన్= పక్షులన్నింటిలో; ఎక్కుడు= గొప్పదానివి; అంచలు= హంసలు; విలసత్+గతిన్= ఒప్పయిన గమనంతో; ఇట్లు= ఈ విధంగా; వినువీథిన్= ఆకాశమార్గంలో; కరంబు+ఎలమిన్= కడువేడ్కతో; చనియెడున్= తిరుగుతున్నాయి; గతుల బహులతన్= వివిధగతులలో; వీనిన్+ కలసి= హంసలతో కలిసి; పఱచి= పరుగెత్తి; గెలువవలదె!= గెలువరాదా!

తాత్పర్యం: 'హంసలు ఆకాశవీథిలో కడు వేడుకతో ప్రకాశిస్తూ విహరిస్తున్నాయి. పక్షులన్నింటిలో గొప్పదానివైన నీవు పలురీతుల గమనాలతో హంసలతో కలిసి పరుగెత్తి వాటిని ఓడించాలి.'

వ. అని తారతమ్య జ్ఞానహీను లగు నయ్యల్పబుద్ధులు సెప్పిన, నుచ్ఛిష్ట దర్పితం బగు నదియును మౌర్ఖ్యంబునం దానంతటి దాన నని తలంచి వానిదెసకుం జని మనంబున వీనిలో మేటి యెయ్యదియో యనుచుం జేరి, తన చూడ్కికి వచ్చిన యంచం బురుడించి, పఱతము రమ్మని పిలిచిన, నయ్యంచలన్నియు నిలిచి పెలుచ నవ్వి యవ్వాయసంబున కి ట్లనియె.4

ప్రతిపదార్థం: అని, తారతమ్యజ్ఞానహీనులు+అగు= ఎక్కువ తక్కువలను గూర్చిన జ్ఞానం లేనట్టి; ఆ+అల్పబుద్ధులు= ఆ తక్కువ తెలివిగలవారు; చెప్పినన్= చెప్పగా; ఉచ్ఛిష్ట దర్పితంబు+అగు+అదియును= ఎంగిళ్ళు తిని

గర్వంతో ఉన్న ఆ కాకి; మౌర్ఖ్యంబునన్= మూర్ఖత్వంతో; తాను+అంతటి దానను+అని, తలంచి= తాను అంత గొప్పదానినే అని భావించుకొని; వాని దెసకున్+చని= ఆ హంసలున్న దిశకు వెళ్ళి; మనంబునన్= తన మనసులో; వీనిలో మేటి ఏ+ఆదియో= వీనిలో గొప్ప హంస ఏదో; అనుచున్+చేరి= అనుకొంటూ వాటిని సమీపించి; తన, చూడ్కికి, వచ్చిన, అంచన్= తన దృష్టిని ఆకర్షించిన ఒక హంసను; పురుడించి= తనకు సాటిగా తలంచి; పఱతము= పరుగెత్తుదము; రమ్ము+అని, పిలిచినన్= రమ్మని పిలువగా; ఆ+అంచలు+అన్నియున్= ఆ హంసలన్నీ; నిలిచి= వచ్చిచేరి; పెలుచన్ నవ్వి= బిగ్గరగా నవ్వి; ఆ+ వాయసంబు నకున్= ఆ కాకితో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాయి;

తాత్పర్యం: అని తారతమ్య భేదం ఎరుగని ఆ అజ్ఞానులు కోరగానే ఎంగిళ్ళు తిని గర్వించిఉన్న మూర్ఖమైన ఆ కాకి, తాను అంతటిదాననే అని తలంచి, ఆ హంసలను దగ్గరకు వెళ్ళి, వాటిలో మేటిగా గోచరించిన దానిని పిలిచి, తనతో సమానంగా పరుగెత్తుమని అడుగగా, ఆ హంసలు నవ్వుతూ కాకితో ఇట్లా అన్నాయి:

క. 'మానససరసి వసింతు మ ।
హీనబలము జవముఁ బక్షు లెల్లను బొగడం
గా నెందుఁ దిరుగుదుము; ద ।
వ్వైనను ఖేదంబు లేదు హంసల మగుటన్. 5

ప్రతిపదార్థం: మానస సరసిన్ వసింతుము= మానస సరోవరంలో నివసిస్తాము; అహీనబలమున్, జవమున్= అమితమైన మా బలమును వేగమును; పక్షులు+ఎల్లను= పక్షులన్నీ; పొగడంగాన్= ప్రశంసించగా; ఎందున్+ తిరుగుదుము= ఎక్కడైనా తిరగగల వారము; హంసలము+అగుటన్= హంసలం కాబట్టి; దవ్వు+ఐనను= దూరమైనా; ఖేదంబు లేదు= బాధ లేదు.

తాత్పర్యం: మానససరోవరం మా నివాసం. మా బలాన్నీ, వేగాన్నీ చూచి పక్షులన్నీ పొగడే విధంగా ఎంత దూరమైనా ఎటువంటి కష్టం లేకుండా ఎగిరిపోగలము.

విశేషం: హిమవత్పర్వత ప్రాంతంలోని మానస సరస్సులో హంసలు నివసిస్తుంటాయనీ, ఇతర ఋతువులలో వేరు ప్రాంతాలకు వెళ్ళినా శరదృతువు రాగానే తిరిగి మానససరోవరం చేరుకుంటాయనీ ప్రసిద్ధి.

వ. ఇట్టి మాయందును. 6

తాత్పర్యం: ఇటువంటి మాలో కూడా.

క. బలశాలి యైన హంసముఁ ।
బిలిచితి పురుడించి పాఱ బేలతనమునన్;
గలవే యింతకు మును హం ।
సలతో బురుడించు వాయసంబులు జగతిన్. 7

ప్రతిపదార్థం: బలశాలి అయిన హంసమున్= ఎంతో బలవంతురాలయిన హంసను; పురుడించి పాఱన్= నీతో పోటీగా పరుగెత్తుటకు; బేలతనమునన్= అమాయకత్వంతో; పిలిచితి(వి)= పిలిచినావు; జగతిన్= లోకంలో; హంసలతో (న్) పురుడించు= హంసలతో సాటి రాగల; వాయసంబులు= కాకులు; ఇంతకున్+మును, కలవే?= ఇంతకుముందు ఉన్నాయా?

తాత్పర్యం: మాలో బలశాలి అయిన హంసనే అవివేకంతో పోటీకి రమ్మని పిలుస్తున్నావు. అసలు హంసలతో సాటిరాగల కాకులు ఇంతవరకు ఎక్కడైనా ఉన్నాయా?

సీ. అనుటయుఁ గాక మిట్లను హంసములతోడ, ।
'గతులు నూటొక్కటి గలవు వాన

నొక్కటొక్కట శతయోజన వ్యాప్తి నే ।
మెఱయుదుఁ బొడవుగా మీఁది కెగసి
చనుట యచ్చటినుండి చక్క నేలకుఁ జోడు ।
వట్టి డిగ్గుట దూరపాత భంగి
సంగతి పరువడి చారులీలా గతి ।
వక్రయానము వలయక్రమంబు

ఆ. లోనుగాఁగ నెట్టు లైనను మీకోరి ।
నట్ల పఱచి మేటి యంచ యైన
దాని నిపుడ గెలుతుఁ; దక్కటి యంచలు ।
భయము వొందఁ గాకి పదుపు వొంగ.' 8

ప్రతిపదార్థం: అనుటయున్= అని హంసలు పలుకగా; కాకము= కాకి; హంసములతోడన్ ఇట్లు+అనున్= హంసలతో ఇట్లా అన్నది; గతులు నూట+ ఒక్కటి కలవు= నూట ఒక్క విధములైన గమనము లున్నాయి; వానన్+ ఒక్కట+ఒక్కటన్= ఒక్కొక్క గమనంలో; నేన్= నేను; శతయోజనవ్యాప్తి= నూరు ఆమడల దూరం; మెఱయుదున్= ప్రకాశిస్తాను (పరుగెత్తగలను); పొడవుగాన్ మీఁదికిన్+ఎగసి చనుట= పొడవుగా పైకి ఎగిరి వెళ్ళటం; అచ్చటినుండి= పై నుండి; చక్కన్= చక్కగా; నేలకున్+ జోడు+పట్టి డిగ్గుట= (అదే విధంగా) భూమిమీదికి సమానంగా దిగటం; దూరపాతభంగి సంగతి= దూరంగా పడుతూ వెళ్ళే పద్ధతి; పరువడిన్= క్రమంగా; చారు, లీలాగతిన్= మనోహరమైన నడకతో; వక్రయానము= వంకరగా వెళ్ళటం; వలయక్రమంబు= గుండ్రంగా తిరగటం; లోనుగాఁగన్= మున్నగునవి; ఎట్టులు+ఐనను= ఏ విధములైనా; మీ కోరిన+అట్ల, పఱచి= మీరు కోరిన విధంగా ఎగిరి; మేటి అంచ+ఐన= ఎంత గొప్ప హంస అయినా; తక్కటి, అంచలు= మిగతా హంసలు; భయము+పొందన్= భయపడేటట్లుగా; కాకి, పదుపు+పొంగన్= కాకుల సమూహం ఆనందంతో పొంగిపోగా; దానిన్+ఇపుడు+అ గెలుతున్= ఆ హంసను ఇపుడే గెలుస్తాను.

తాత్పర్యం: అని హంసలు అనగానే కాకి వాటికి సమాధానంగా ఇట్లా అన్నది: 'నూట ఒక్క గతులు వేటిలోనైనా నేను నూరు ఆమడల దూరం వెళ్ళగలను. పొడవుగా మీదికి ఎగిరి అదే విధంగా నేలకు దిగి రాగలను. మనోహర గతులతో వంకరగా, వలయాకారంగా మీరు కోరిన విధంగా పరుగెత్తి ఎటువంటి హంసనైనా ఓడించగలను. మిగిలిన హంసలన్నీ భయపడేటట్లుగ, కాకులు నన్ను చూచి పొంగిపోయేటట్లుగ దానిని గెలుస్తాను.

విశేషం: పక్షుల నడకలను పేర్కొనటంలో తిక్కన సూక్ష్మపరిశీలన, లోకజ్ఞత సువ్యక్తమౌతున్నాయి. యోజనము= నాలుగు కోసుల దూరం (ఆమడ).

కాకము హంసముతో సముద్రముమీఁదఁ బఱచి భంగపడుట(సం. 8-28-27)

వ. అనుటయు విని ము న్నాహూతం బైన హంసం బక్కాకంబు నాలోకించి. 9

ప్రతిపదార్థం: అనుటయున్+విని= అనగా విని; మున్ను+ఆహూతంబు+ ఐన= ముందు పిలువబడిన; హంసంబు= హంస; ఆ+కాకంబున్+ ఆలోకించి= ఆ కాకిని చూచి.

తాత్పర్యం: కాకి మాటలు విని ముందు పందెపు పోటీకి పిలువబడిన హంస దానిని చూచి. (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. 'నూఱుగతుల నీవు వాఱుదే నన్నియు ।
నెఱుఁగఁ బులుఁగు లెల్ల నెట్లు వాఱు
నడరి యాకసమున నిడుబాట నట్ల పా ।
ఱుదము రమ్ము జలధి చదల' ననిన. 10

ప్రతిపదార్థం: నూఱుగతులన్= నూరు నడకలలో; నీవు పాఱుదు+ఏన్= నీవు ఎగుర గలిగితే; అన్నియున్+ఎఱుఁగన్= అవి అన్నీ నాకు తెలియవు. పులుఁగులు+ఎల్లన్= అన్నిపక్షులు; ఆకసమునన్= ఆకాశమార్గమునందు; అడరి= అతిశయించి; నిడుబాటన్= చక్కగా; ఎట్లుపాఱున్= ఎట్లా పరుగెత్తుతాయో; జలధి, చదలన్= సముద్రంమీది ఆకాశంలో; అట్ల పాఱుదము రమ్ము= అట్లా ఎగురుదాము రమ్ము; అనినన్= అనగా;

తాత్పర్యం: నూరుగతులలో పరుగెత్తగలనన్నావు గదా. అవన్నీ నాకు తెలియవు. ఆకాశమార్గంలో పక్షులన్నీ నిడువుగా ఎట్లా ఎగురుతాయో అట్లా సముద్రంపై ఆకాశమార్గంలో చక్కగా పరుగెత్తుదాము రమ్ము' అని హంస పలుకగా.

విశేషం: హంస మాటలలో వినయంతో కూడిన ఆధిక్యం, హుందాతనం గోచరిస్తున్నాయి.

వ. అయ్యెడం గూడిన కాకంబు లపహసించి 'శతప్రకారగతి యగు దీనితో నేకయాన పర్యవసానహీన సముత్సాహ దోహలి వగు నీ వెట్లు మచ్చరించెదవు; పఱచి భంగపడియెదవు గాక' యనుటయు, నమ్మరాళం బా గమిం బాసి పఱవఁ దొడంగినం దోన యవ్వాయసంబునుం బఱచె; నిట్లు రెండును మున్నీటిపై మిన్ను దఱిసి పాఱునట్టియెడ. 11

ప్రతిపదార్థం: ఆ+ఎడన్+కూడిన, కాకంబులు= అక్కడ గుమిగూడిన కాకులు; అపహసించి= ఎగతాళిచేసి; శతప్రకారగతి అగు దీనితోన్= నూరుగతులల సంచరించ గల ఈ కాకితో; ఏకయాన పర్యవసాన= ఒక్క నడకలో మాత్రమే; హీనసముత్సాహ దోహలివి+అగు నీవు= అల్పోత్సాహ సంరంభం గల నీవు; ఎట్లు మచ్చరించెదవు?= ఎట్లు పోటీపడతావు?; పఱచి= పరుగెత్తి; భంగపడియెదవు గాక= అవమానం పాలగుదువు కాని; అనుటయున్= అనగానే; ఆ+మరాళంబు= ఆ హంస; ఆ గమిన్+పాసి= ఆ గుంపును విడిచి; పఱవన్ తొడంగినన్= పరుగెత్తసాగగా; తోన్+అ= వెంబడి; ఆ+ వాయసంబునున్+పఱచెన్= ఆ కాకి కూడా ఎగిరింది; ఇట్లు, రెండును= హంస, కాకి; మున్నీటిపైన్= సముద్రంపై గల; మిన్ను దఱిసి= ఆకాశాన్ని సమీపించి; పాఱునట్టి ఎడన్= పరుగెత్తుతున్న సమయంలో.

తాత్పర్యం: అక్కడ చేరిన కాకులు 'శతగతులు నేర్చిన ఈ కాకితో ఏకైక గమనవగు నీవు పోటీపడి అవమానం పాలు కావలసిందే కాని, ఏ విధంగా సాటి కాగలవు?' అని హంసను పరిహసించగా, ఆ హంస మారుమాటాడక వాటిని వదలి సముద్రం పైమార్గంలో పరుగెత్తసాగింది. కాకికూడా దానిని వెంబడించింది. ఈ విధంగా రెండూ పోటీపడి ఎగురుతూ ఉండగా.

క. రాయంచ మందగతిఁ జను।
వాయస మతితీవ్రభంగి వలను మెఱసి లీ
లాయితము లొప్ప బహుగమ।
నాయాసము నొంది పఱచు నగ్గలిక మెయిన్. 12

ప్రతిపదార్థం: రాయంచ= రాజహంస; మందగతిన్+చను= మందగమనంతో వెళ్ళు తున్నది; వాయసము= కాకి; అతి తీవ్రభంగిన్= మిక్కిలి వేగంగా; వలను మెఱసి= నేర్పు చూపుతూ; లీలా+ఆయితములు+ఒప్పన్= విలాస క్రీడలతో; అగ్గలిక మెయిన్= ఉత్సాహంతో; బహుగమన+ఆయాసమున్= వివిధ గతులవలన కలిగిన అలసటను; ఒంది= పొంది; పఱచున్= పరుగెత్తుతున్నది.

తాత్పర్యం: రాజహంస అలసట లేకుండా మందగమనంతో వెళ్ళుతుంటే, వాయసం ఉత్సాహంతో క్రీడావిలాసంతో తన నేర్పులు చూపుతూ వివిధగతులలో వేగంగా వెళ్ళటం వలన అలసట చెందుతూ పరుగెత్తుతున్నది.

ఆ. ఎలమిఁ గడచి పోవుఁ బిలుచుఁ గ్రమ్మఱి వచ్చి।
ముక్కు ముక్కు మీఁద మోపుఁ జుట్టు

నేచి తిరుగు నీఁక లీఁకలతో రాయు ।

నోరయుఁ జిత్రగతుల మురియు నవ్వు. 13

ప్రతిపదార్థం: ఎలమిన్+కడచిపోవున్= ఆనందంతో (హంసను) దాటిపోతుంది; క్రమ్మఱి వచ్చి పిలుచున్= తిరిగివచ్చి పిలుస్తుంది; ముక్కుమీఁద ముక్కు మోపున్= ముక్కుమీద ముక్కు ఉంచుతుంది; చుట్టున్+ఏచి తిరుగున్= చుట్టూ విజృంభించి తిరుగుతుంది; ఈఁకలు+ఈఁకలతోన్, రాయున్= (తన) ఈకలతో (హంస) ఈకలను రాసేది; చిత్రగతుల ఒరయున్= చిత్రమైన గతులతో తాకుతుంది; మురియున్= మురిసిపోతుంది; నవ్వున్= నవ్వుతుంది.

తాత్పర్యం: ఆ కాకి హంసను దాటిపోయి తిరిగివచ్చి పిలిచేది. దాని ముక్కుమీద ముక్కు మోపేది. ఈకలను ఈకలతో రాసేది. దానిచుట్టూ విజృంభించి తిరిగేది. చిత్రమైన నడకలతో వచ్చి తాకేది. తనలో తాను మురిసిపోతూ నవ్వేది.

విశేషం: మిడిసిపాటు నిండిన కాకి చేష్టలు పొడిమాటల్లో స్వాభావికంగా చిత్రితమైనాయి.

వ. ఇ వ్విధంబునం గాకం బనేక ప్రకార ప్రసరణ చతురంబై సంచరించుటం జూచి ముదితంబు లైన వాయసంబు లధిక స్వరంబుల మెఱయుచు హంసంబుల గేలికొని నవ్వుచుఁ దరువులపయిం ద్రుళ్లి త్రుళ్లి యాడుచు 'మరాళంబు పరాభవంబుఁ బొందెడుఁ జూడుం' డని పెద్ద యెలుంగునం బలుకుచుండఁ దదీయ కలకలం బాలించి హంసంబు భరితోత్సాహం బై. 14

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ విధంగా; కాకంబు= కాకి; అనేక ప్రకార= వివిధములైన; ప్రసరణ చతురంబు+ఐ= గతుల నేర్పు కలిగినదై;

సంచరించుటన్+ చూచి= పరుగెత్తటం చూచి; ముదితంబులు+ఐన వాయసంబులు= సంతోషించిన కాకులు; అధికస్వరంబులన్, మెఱయుచున్= పెద్దగా అరిచి ప్రకాశిస్తూ; హంసంబులన్= హంసలను; గేలికొని నవ్వుచున్= గేలిచేస్తూ నవ్వుతూ; తరువుల పయిన్= చెట్లపై; త్రుళ్ళి త్రుళ్ళి ఆడుచున్= గంతులు వేస్తూ; మరాళంబు= హంస; పరాభవంబున్+ పొందెడున్= అవమానం పాలవుతుంది; చూడుండు+అని= చూడండి అని; పెద్ద ఎలుంగునన్ పలుకుచుండున్= పెద్ద గొంతుతో అంటూ ఉండగా, హంసంబు= హంస; తదీయ కలకలంబు= వాటి అరపులు; ఆలించి= విని; భరిత+ ఉత్సాహంబు+ఐ= నిండు ఉత్సాహం కలదై.

తాత్పర్యం: కాకి ఈ విధంగా వివిధ గతుల నేర్పులు ప్రదర్శిస్తూ పరుగెత్తటం చూచిన తోటి కాకులు, సంతోషంతో అరుస్తూ, హంసలను గేలిచేస్తూ చెట్లపై గంతులు వేయసాగాయి. 'హంస ఓడిపోతుంది' అని పెద్ద గొంతులతో అరవసాగాయి. వాటి అరపులు విన్న హంస నిండు ఉత్సాహంతో-

క. పొడవునకు నెగసి యెప్పటి ।

పడమటి దెస నిగిడి పెలుచఁ బఱచినఁ గూడం

గడు రయమునఁ జని యంచం ।

గడవంగా కీలకఱచి కాకము పాఱున్. 15

ప్రతిపదార్థం: పొడవునకున్+ఎగసి= నిలువుగా పైకి ఎగిరి; ఎప్పటి పడమటి దెస నిగిడి= మునుపటివలె పడమరదిక్కున వెళ్ళి; పెలుచన్+పఱచినన్= అధికవేగంతో పారగా; కాకము= కాకి; కూడన్= వెంబడి; కడురయమునన్+ చని= మిక్కిలి వేగంగా వెళ్ళి; అంచన్+కడవన్+కాక= హంసను దాటశక్యం గాక; ఈలకఱచి= ఊపిరి బిగబట్టి; పాఱున్= పరుగెత్తింది.

తాత్పర్యం: పొడవుగా పైకి ఎగిరి పడమటివైపు పారగా, కాకి కూడ దానివెంట వేగంగా వెళ్ళి ఆ హంసను దాటటానికి శక్యం కాక ఊపిరి బిగబట్టి పరుగెత్తసాగింది.

వ. పాఱిపాఱి డయ్యుటయు నయ్యంచ యుదంచిత త్వరితగమన కళా వైదగ్ధ్యంబు మెఱయం బఱచిన బీఱువడి కాకం బాకులాంతరంగంబును వికలాంగంబును నై యిట్లని వితర్కించు. 16

ప్రతిపదార్థం: పాఱి, పాఱి, డయ్యుటయున్= పరుగెత్తి పరుగెత్తి అలసిపోగా; ఆ+అంచ= ఆ హంస; ఉదంచిత= ఒప్పయిన; త్వరితగమన కళావైదగ్ధ్యంబు= శీఘ్రగమన చాతుర్యం; మెఱయన్+పఱచినన్= చూపుతూ పారగా; కాకంబు= కాకి; బీఱువడి= దిటవు కోల్పోయి; ఆకుల+అంతరంగంబును= చెదరిన మనసు; వికల+ అంగంబునున్+ఐ= శక్తి కోల్పోయిన శరీరం కలదై; ఇట్లు+అని= ఈ విధంగా; వితర్కించున్= ఆలోచించసాగింది.

తాత్పర్యం: హంస, శీఘ్రగమన చాతుర్యాన్ని ప్రదర్శిస్తూ పారగా, దానితోపాటు పరుగెత్తుతూ అలసిపోయిన కాకి శక్తికోల్పోయి బలహీనమయి మనసు కలతనొందగా ఇట్లా చింతించసాగింది.

క. 'నేరక తొడరితిఁ గాల్మోన ।
భూరుహములు లతలు గిరులుఁ బొద లేమియు లే;
వారయ బహుసత్త్వ మయము ।
వారిధి డిగి సోఁకినపుడ వలయుం బొలియన్.' 17

ప్రతిపదార్థం: నేరక, తొడరితిన్= తెలియక పందానికి పూనుకొన్నాను; కాల్మోనన్= కాలుపెట్టటానికి; భూరుహములు= చెట్లు; లతలు= తీగలు; గిరులున్= కొండలు; పొదలు+ఏమియున్, లేవు= పొదలు ఏవీ లేవు; వారిధి= సముద్రం; ఆరయన్= చూడగా; బహుసత్త్వమయము= పెక్కు జంతువులతో నిండినది; డిగి సోకినపుడు+అ= దిగగా అవి ముట్టుకుంటేనే; పొలియన్ వలయున్= చనిపోవాలి.

తాత్పర్యం: 'ఎరుగక హంసతో పోటీకి సిద్ధపడ్డాను. కాలు నిలపటానికి మార్గంలో చెట్లు, తీగలు, పొదలు, గట్లు ఏవీ లేవు. నీటిపై దిగుదామా అంటే సముద్రంలోని జంతువుల బారిన పడక తప్పదు.'

వ. అనుచు దీన మానసం బయి భయంబునం గలంగి డప్పి సొగసి యవశత నంతకంతకు డిగుచున్న యక్కాకిం గనుంగొని కలహంసం బి ట్లనియె. 18

ప్రతిపదార్థం: అనుచున్= అనుకొంటూ; దీనమానసంబు+అయి= దిగులు చెందిన మనసు కలదై; భయంబునన్+కలంగి= భయంతో కలతచెంది; డప్పిన్+సొగసి= దాహంతో అలసి; అవశతన్= వశంతప్పి; అంతకున్+ అంతకున్, డిగుచున్న= మెల్లమెల్లగా దిగుతున్న; ఆ+కాకిన్= ఆ కాకిని; కనుంగొని= చూచి; కలహంసంబు+ఇట్లు+అనియెన్= రాజహంస ఇట్లా అన్నది.

తాత్పర్యం: అని అనుకొంటూ దిగులుతో, భయంతో కలతచెందిన మనసు గలదై కాకి, దప్పితో వశంతప్పి క్రమంగా క్రిందికి దిగసాగింది. దాన్ని చూచిన హంస ఇట్లా అంటున్నది.

ఆ. 'నీ వనేకగతులు నే ర్తిది యే గతిఁ ।
జనుట చెపుమ వాయసంబ! యేను
గడవ నరిగి పిలువఁగా నేల తడసెద? ।
వెఱక లేటి కిట్టు లెడల విడువ?' 19

ప్రతిపదార్థం: వాయసంబ!= ఓ కాకమా!; ఏను= నేను; కడవన్+అరిగి= (నిన్ను) దాటిపోయి; పిలువన్‌కాన్= పిలువగా; ఏల తడసెదవు?= ఎందుకు ఆలస్యం చేస్తున్నావు?; ఎఱకలు= రెక్కలు; ఇట్టులు= ఈ విధంగా; ఎడలన్+విడువన్= (నీకు) దూరమై పోయినట్లు విడవటం; ఏటికిన్?= ఎందుకు?; నీవు, అనేకగతులు= ఎన్నో నడకలు; నేర్తు(వు)= నేర్చినదానవు; ఇది, ఏ గతిన్ చనుట= ఏ నడకతో వెళ్ళుటో; చెపుమ= చెప్పుము.

తాత్పర్యం: 'ఓ వాయసమా! నేను నిన్ను దాటి పిలిచినా నీవు బదులు పలుకక జాప్యం చేస్తున్నావు. నీ రెక్కలు నీకు దూరమైపోయినట్లు చాస్తున్నావు. నీవు నేర్చిన పెక్కు గతులలో ఇది ఏ రకమైన గమనమో చెప్పుతావా?'

విశేషం: నూటొక్క గతులలో ఆరితేరినదానను(63ప.) అన్న కాకి మాటలకు బదులుగా ఇది ఎత్తిపొడుపు.

వ. అనియె నట్టియెడ. 20

ప్రతిపదార్థం: అనియెను; అట్టిఎడన్= అప్పుడు.

తాత్పర్యం: అని హంస కాకితో హేళనగా పలుకగా, అప్పుడు.

క. తలకొని జలములు పక్షం।
బులు దుండము దోఁక సోఁక బొరిఁబొరి నెగయన్
బలమఱి మెయి దిగఁబడఁగా।
సొలసి యెగయలేక వాయసుఁడు వెగడొందెన్. 21

ప్రతిపదార్థం: తలకొని= పూని; జలములు= సముద్ర జలాలు; పక్షంబులు= రెక్కలు; తుండము= ముక్కు; తోఁక= తోకను; సోఁకన్= తాకగా; పొరిన్ పొరిన్+ఎగయన్= మాటిమాటికి ఎగిసిపడగా; బలము+అఱి= బలము నశించి; మెయి దిగఁబడఁగాన్= శరీరం క్రిందికి వ్రాలగా; వాయసుఁడు= కాకి; సొలసి= అలసి; ఎగయ లేక= ఎగర లేక; వెగడు+ఒందెన్= భయపడెను.

తాత్పర్యం: సముద్ర జలాలు రెక్కలను, ముక్కును, తోకను తాకుతూ ఉండగా, మాటిమాటికి మీదికి ఎగురుతూ, బలహీనపడి క్రిందికి వ్రాలుతూ ఉండగా - అలసిపోయి ఎగురలేక భయపడింది.

విశేషం: 'వాయసుఁడు' అన్న మాటలో గర్వంతో కన్నూమిన్నూ కానని 'మానవుడు' స్ఫురిస్తాడు.

వ. ఇట్లు మున్నీటి నీటి పయింబడి యగ్గలం బగు దురవస్థకు బెగ్గలంబు నొందు కాకంబు నాలోకించి 'పలుకనగుం గాక; పలికినట్ల యెవ్వరికిఁ జేయఁ దీరుఁ? బని తీరెంగదా' యనిన రాయంచకు న క్కాకం బిట్లనియె. 22

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; మున్నీటి నీటి పయిన్+పడి= సముద్రజలంమీద పడి; అగ్గలంబు+అగు దురవస్థకున్= మిక్కిలి హీనస్థితికి; బెగ్గలంబున్+ఒందు= భయపడుతున్న; కాకంబున్+ఆలోకించి= కాకిని చూచి; పలుకన్+అగున్+కాక= (మాటలు) పలుకవచ్చునుకాని; పలికిన+అట్లు+అ= పలికినట్లుగానే; ఎవ్వరికిన్+చేయన్+ తీరున్?= చేయటానికి ఎవరికి వీలవుతుంది?; పని తీరెన్+కదా అనినన్= నీ పని ముగిసింది కదా అనగా; రాయంచకున్= రాజహంసతో; ఆ+కాకంబు+ఇట్లు+ అనియెన్= ఆ కాకి ఇట్లా అన్నది:

తాత్పర్యం: ఈ విధంగా పైకి ఎగురలేక సముద్రపు నీటిమీదపడి, తన బలహీనస్థితికి భయపడుతున్న కాకిని చూచి రాజహంస ఇట్లా అన్నది: 'మాటలు ఎన్నయినా చెప్పవచ్చు. కాని చెప్పినదంతా చెయ్యటం ఎవరికి సాధ్యమౌతుంది. గొప్పలు పలికిన నీ పని అయిపోయింది కదా!' అన్న హంస మాటలు విని కాకి ఇట్లా అంటున్నది:

క. 'ఎంగిళులు గుడిచి క్రొవ్వునఁ।
బొంగిన మెయితోడ గర్వమునఁ దిరుగుచు నా
కుం గలదె యెందు నెదురు? వి।
హంగమ పతి నైన గెలుతు' నని మును దలఁతున్. 23

ప్రతిపదార్థం: ఎంగిళులు, కుడిచి= ఎంగిళ్ళు తిని; క్రొవ్వునన్+పొంగిన మెయితోడన్= కొవ్వుతో బలసిన దేహంతో; గర్వమునన్ తిరుగుచున్= గర్వంగా తిరుగుతూ; నాకున్= నాకు; ఎందున్= ఎక్కడైనా; ఎదురు కలదె?= ఎదురు ఉన్నదా?; విహంగమపతిన్+ ఐనన్= పక్షిరాజైన గరుడుని కూడా; గెలుతును+అని= గెలువగలనని; తలఁచుదున్= ఇంతకుముందు భావించాను.

తాత్పర్యం: ఎంగిళ్ళు తిని, బలిసిన దేహంతో గర్వించి, నాకు ఎదురు ఎవరూ లేరని భావిస్తూ గరుత్మంతుడిని సైతం ఓడించగలనని తలచేదానిని.

క. నా కొలఁది యిప్పుడెఱిఁగితి ।
నీ కరుణాలోకనంబు నిగిడించి శర
ణ్యా! కావు నన్నుఁ మగుడం ।
గాకులలోఁ గలుపఁ దగవు గాదే నీకున్?' 24

ప్రతిపదార్థం: నా కొలఁది ఇప్పుడు+ఎరిగితిన్= నా పరిమితి ఇప్పుడు తెలిసికొన్నాను; శరణ్యా!= శరణు పొందదగినవాడా!; నీ కరుణా+ఆలోకనంబు= నీ దయాదృష్టిని; నిగిడించి= ప్రసరించి; కావు= రక్షించు; నన్నున్; మగుడన్= మళ్ళీ; కాకులలోన్= కాకుల్లో; కలుపన్= చేర్చగా; నీకున్= నీకు; తగవు కాదే?= న్యాయం కదా!

తాత్పర్యం: నా అల్పత్వం ఎంతో ఇప్పుడు తెలుసుకొన్నాను. నిన్ను శరణు కోరుతున్నాను. నాపై దయ చూపి నన్ను రక్షించు. నా తోటి కాకులలో మళ్ళీ నన్ను చేర్చుము. ఇది నీకు న్యాయం కదా.

వ. అని యిత్తెఱంగున. 25

తాత్పర్యం: అని ఈ విధంగా.

క. ఆకులతఁ బొంది పలుకుచుఁ ।
గా కా యని చంచుఁ దెఱచి కడు నఱచుచు నీ
రాకరమున మునిఁగెడు న ।
క్కాకిం గని హంస పరమకారుణ్యమునన్. 26

ప్రతిపదార్థం: ఆకులతన్+పొంది= కలతచెంది; కా కా అని= కావు కావు అని; పలుకుచున్= పలుకుతూ; చంచున్ తెఱచి= ముక్కు(నోరు) తెరచి; కడున్+ అఱచుచున్= ఎంతగానో అరుస్తూ; నీరాకరమునన్= సముద్రంలో; మునిఁగెడు= మునుగుతున్న; ఆ+కాకిన్+కని= ఆ కాకిని చూచి; హంస; పరమ కారుణ్యమునన్= మిక్కిలి దయతో.

తాత్పర్యం: వ్యాకులమైన మనసుతో కావు కావు మని ఎంతగానో అరుస్తూ నీటిలో మునిగిపోతున్న కాకిని చూచి హంస దయతో-

క. వెరవునఁ దత్తనువుం దన ।
చరణంబుల నిఱికి యెత్తి చా వుడిపి బల
స్ఫురణంబు మెఱయ వీఁపున ।
ధరియించుచు వచ్చెఁ బక్షితతులు నుతింపన్. 27

ప్రతిపదార్థం: వెరవునన్= ఉపాయంతో; తద్+తనువున్= ఆ కాకి దేహాన్ని; తన చరణంబులన్= తన కాళ్ళలో; ఇఱికి ఎత్తి= ఇరికించుకొని పైకెత్తి; చావు+ఉడిపి= చావునుంచి కాపాడి; బల స్ఫురణంబు మెఱయన్= బలస్ఫూర్తి ప్రకాశించగా; వీఁపున ధరియించుచున్= వీపుపై మోసికొని; పక్షితతులు, నుతింపన్= పక్షులన్నీ కొనియాడగా; వచ్చెన్= వచ్చింది.

తాత్పర్యం: కాకిని తన కాళ్ళతో పట్టి పైకెత్తి, దాని ప్రాణాలు కాపాడి, బలమొప్పగా వీపున మోసికొని వస్తున్న హంసను చూచి పక్షులన్నీ పొగడసాగాయి.

వ. ఇవ్విధంబునం దెచ్చి యెప్పటి నెలవున డించి, రాయంచ యక్కాకి దెప్పిఱిన, దానితో నచ్చటి కాకులు విన 'నింక నిట్టి యవినయంబు లెన్నండును జేయకు' మని పలికి నిజ సహచరంబు లగు మరాళంబులుం దానును వలయు చోటికిం జనియె; నీవు నా కోమటి కొడుకుల యెంగిలి కూటం బెరిఁగిన యక్కాకంబు చందంబునఁ గురుకుమారుల యెంగిళులు గుడిచి క్రొవ్వి, యెక్కుడువారల ధిక్కరించెదవు; నీ కొలఁది యెఱుంగవు; దీనం జేటు వాటిల్లుఁ గాన తేటపడ నెఱింగించెద నాకర్ణింపుము. 28

ప్రతిపదార్థం: రాయంచ= రాజహంస; ఈ విధంబునన్+తెచ్చి= కాకిని ఈ విధంగా మోసికొనివచ్చి; ఎప్పటి నెలవునన్ డించి= దాని నివాసంలో

దించి; ఆ+కాకి తెప్పిటినన్= కాకి తెప్పరిల్లగా; అచ్చటి కాకులు వినన్= అక్కడ ఉన్న కాకులు వినేటట్లుగా; దానితోన్= ఆ కాకితో; ఇంకన్= ఇకముందు; ఇట్టి అవినయంబులు= అహంభావంతో కూడిన పనులు; ఎన్నండును చేయకుము= ఎప్పుడూ చేయవద్దు; అని పలికి= అని వచించి; నిజ సహచరంబులు+అగు, మరాళంబులున్= తనతోటి హంసలూ; తానును= తానూ; వలయుచోటికిన్+చనియెన్= తమ కోరిన ప్రదేశానికి వెళ్ళాయి; నీవును= నీవు కూడా(కర్ణుడు); ఆ కోమటి కొడుకులు= ఆ వైశ్య పుత్రుల ఎంగిలి కూటన్+పెరిఁగిన= ఎంగిలికూడుతో పెరిగిన; ఆ+కాకంబు చందంబునన్= ఆ కాకివలెనే; కురు కుమారుల= దుర్యోధనాదుల; ఎంగిళులు కుడిచి= ఎంగిళ్ళు తిని; క్రొవ్వి= గర్వించి; ఎక్కుడు వారల= నీ కంటె అధికులైన వారిని (కృష్ణార్జునులను); ధిక్కరించెదవు= తిరస్కరిస్తున్నావు; నీ కొలఁది ఎఱుంగవు= నీ పరిమితి తెలిసికొనలేకుండా ఉన్నావు; దీనన్+చేటు+పాటిల్లున్+కానన్= ఇందువలన నీకు హాని కలుగుతుంది కాబట్టి; తేటపడన్+ఎఱింగించెదన్= తెలిసేటట్లుగా చెబుతాను; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: హంస ఈ విధంగా కాకిని మోసికొని వచ్చి దాని స్థానంలో దింపింది. కాకి స్తిమితపడిన తర్వాత తోటి కాకులు వినేటట్లుగా ఇక ముందెప్పుడూ గర్వంతో ఈ విధమైన పనులకు పూనుకొనవద్దని బుద్ధి చెప్పి తోడి హంసలతో కలిసి వెళ్ళిపోయింది. కాకి హంసల కథను కర్ణుడికి వినిపించి శల్యుడు అతడితో 'వైశ్యకుమారులు పెట్టిన ఎంగిళ్ళు తిని గర్వించిన కాకివలెనే నీవు కూడా కౌరవుల ఎంగిళ్ళు తిని, నీ శక్తిని మరచి, నిన్ను మించినవారితో తలపడుతున్నావు. దీనివలన నీకే హాని జరుగుతుంది కాబట్టి నా మాటలు వినుము.' అంటూ.

విశేషం: 28 పద్యగద్యాలలో కొనసాగిన హంస వాయసముల కథ ద్వారా కర్ణుడిని అవమానపర్చాలన్న శల్యుడి ఉద్దేశం ప్రస్ఫుటమవుతున్నది. ఈ

ఉపాఖ్యానానికి ముందు 'హితోపదేశంబు సేయ మాననేర్తునే' అంటూ చివర 'చేటు వాటిల్లుఁగాన తేటపడ నెఱింగించెద' అనటంలో ప్రధానకథకు భంగం కలగకుండా పొందికను కూర్చటంలో తిక్కన రచనా నైపుణ్యం వెల్లడి అవుతున్నది. సుప్రసన్నుడవైనవాడా! గమనాగమనములు లేనివాడా! శాంతిదాంతులచేత తెలియదగిన తత్త్వం కలవాడా!

విశేషం: లోకంలోని వస్తువులను వివిధ ప్రమాణాలతో తూచినట్లు హరిహరనాథుడిని తూచలేము. ఆయన అన్నిటికీ అతీతుడు. సర్వవ్యాపకుడవటం చేత గమనాగమన వర్జితుడు.

మాలిని.

ద్విజపతి వృషభాంకోదీర్ణ! కారుణ్య పూర్ణా!
భజన నిరతరక్షా ప్రౌఢ! నిర్భేదరూఢా!
గజదురిత సముత్సేకఘ్న! హృత్పద్మనిఘ్నా!
యజన విధి ఫలత్వవ్యాప్త! నిత్య ప్రదీప్తా! 29

ప్రతిపదార్థం: ద్విజపతి వృషభాంక+ఉదీర్ణ!= గరుడ వృషభవాహనాలతో కూడిన శ్రేష్ఠుడా!; కారుణ్యపూర్ణా!= కరుణాభావంతో నిండినవాడా!; భజన నిరతరక్షాప్రౌఢ!= భక్తులను ఎల్లప్పుడు కాపాడటంలో ప్రావీణ్యం కలవాడా!; నిర్భేదరూఢా= భేదంలేకపోవటంచేత ప్రసిద్ధుడా!; గజదురితసముత్సేకఘ్న!= ఏనుగుయొక్క దుఃఖాతిశయాన్ని నశింప జేసినవాడా!; హృద్+పద్మనిఘ్నా!= హృదయ కమలంలో ఇమిడేవాడా!; యజనవిధి ఫల త్వవ్యాప్త!= యజ్ఞకర్మమునకు ఫలంగా స్వరూపం పొందినవాడా!; నిత్యప్రదీప్తా!= నిత్య తేజోరూపుడా!

తాత్పర్యం: హరిగా గరుడ వాహనంచేత, హరుడిగా వృషభ వాహనంచేత ప్రసిద్ధమైనవాడా! హరిహరనాథా! ఆర్తులపట్ల కరుణామూర్తివి, నిరంతర భక్తరక్షకుడవు. భేదరహితుడవు. గజనాథుడి బాధను హరిరూపంలో, గజాసురుడి దురితాన్ని హరుడి రూపంలో నశింపజేసినవాడా! సర్వవ్యాపకుడవై హృదయకోశంలో నిలిచేవాడా! యజ్ఞఫలస్వరూపుడా! నిత్య తేజోరూపుడా!

విశేషం: పై మూడు పద్యాలూ తిక్కన కృతినాథుడైన హరిహరనాథుడి స్తుతులు. ఆశ్వాసాంతంలో కృతిపతిని స్తుతించే పద్యాలు రచించటం ప్రాచీనకవి సంప్రదాయం. మొదటి పద్యంలో వృత్త వైవిధ్యం పాటించి మిగిలిన రెండూ వరుసగా కందం, మాలిని చందస్సులలో వ్రాయటం తిక్కన అవలంబించిన పద్ధతి.

గద్యము.

ఇది శ్రీమదుభయకవిమిత్ర కొమ్మనామాత్యపుత్ర బుధారాధనవిరాజి
తిక్కన సోమయాజి
ప్రణీతం బయిన శ్రీమహాభారతంబున కర్ణపర్వంబునందు
ద్వితీయాశ్వాసము.

తాత్పర్యం: ఉభయ కవిమిత్రుడూ, కొమ్మనామాత్య పుత్రుడూ, పండితులను పూజించే వాడూ (పండితులచేత పూజించబడి ప్రకాశించేవాడూ) అయిన తిక్కన సోమయాజి రచించిన మహాభారతంలోని కర్ణపర్వ ద్వితీయాశ్వాసం ఇది. **మహాభారతంలో కర్ణపర్వంలోని ద్వితీయాశ్వాసం సమాప్తం.**